
శ్రీరస్తు

శుభమస్తు    అవిఘ్నమస్తు

# శ్రీ సుబ్రహ్మణ్య భుజంగమ్



**సంస్కృతమూలం**
**ఆదిశంకరాచార్య**
**తెలుగు పద్య తాత్పర్యములు**

రచన
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.



## శ్రీ సుబ్రహ్మణ్య భుజంగమ్

మొదటి ప్రచురణ
సెప్టెంబర్ 2010

రచన
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.

వెల : అమూల్యం

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. & ప్రింటింగ్ :
కె. మురళీ కృష్ణ
9848515109



## ప్రార్థన

కం॥ శ్రీపతి బ్రహ్మేంద్రాదులు
ఆపగ తారకుని పీడి హరుబ్రార్థించన్
ఈ పృథ్వినవతరించెను
పాపై షణ్ముఖుడు గౌరి ప్రసవించకనే.

కం॥ తెలిపితి ‘షణ్ముఖ విజయము’
అలనాడే పద్యమందు అద్రిజపతితో
కలిసిన వైనము జెప్పితి
మలిజన్మను దాటుదారి బడితిని సుండీ!

కం॥ ఇది శ్రీ సుబ్రహ్మణ్యుని
మదినెంచి ‘భుజంగ’ మిట్లు పద్యకవితగా
ముదముగ నందించెదనిక
చదువుడు, తథ్యంబు కలుగు సత్ఫలితంబుల్

చం॥
కనుగొననైతి  కారణము కమ్మటి పద్యము సేయ శ్లోకమున్
మనమున ప్రీతికల్గు, గొని మాన్యుల సాయము, జేతునవ్విధిన్
వినుడిది సత్యమున్ దెలుప భీతియదేటికి, నేర్వనైతినే
ననుపమమైన సంస్కృతము, అందులకే పొరబాట్లు యెక్కుడౌ.



సీ॥ అయ్యబిడ్డట వీడు అమ్మ చన్గుడువడు
పాలుద్రాపిరి ఋషిపత్నులపుడు
ఆరుమొగంబులు, హస్తముల్ పన్నెండు
కనులముందు పెరిగి ఘటికుడయ్యె
క్రౌంచశైలంబును ఖండించె, సురసేన
నేతయై తారకున్ నిహతుజేసే
దేవసేన మొగడు తీరికగా వల్లి
చేబట్టె మనువాడ జేరి తానె

తే॥ శక్తి శూలముతో “చెడు” జంపుచుండు
ఇచ్చుధనము ఆరోగ్యము ఇహము నందు
మోక్షప్రాప్తికి స్కందుడే మూలమగును
చదువుడిక భక్తి స్వామి ‘భుజంగ’ మిపుడు

ఉ॥
మోములు ఆరు స్కందునికి ముఖ్యుడు తానట దేవసేనకున్
భామిని దేవసేన పతి వాహన మీతనికిన్ మయూరమౌ
తామసుడైన తారకుని దండముచే దునుమాడి ఆ పయిన్
ప్రేమగ తాళిగట్టె వని భిల్లులకూనకు వల్లిదేవికిన్.

# ముందుమాట

ఆదిశంకరాచార్యప్రణీతమైన ఈ భుజంగస్తోత్రము పరమేశ్వరుని పుత్రుడైన సుబ్రహ్మణ్యుని కీర్తిస్తూ చెప్పిన స్తుతి. సర్వాంగములకు స్వామి రక్షకలుగవలెనని ఒక్కొక్క అంగమునకు స్వామి రక్షకోసం ఒక్కొక్క శ్లోకం చొప్పున చెప్పారు.

దురదృష్టవశాత్తు ఆంధ్రదేశంలో భహుశా ఇది తెలుగులిపిలో జనులలో ప్రాచుర్యం పొందియుండకపోవచ్చు. అది నాకంటబడలేదు. స్వామి బహుశా వీడు నా పేరు పెట్టుకొని నాభుజంగం వ్రాయడా! అని అనుకొన్నాడేమో నేను షణ్ముఖవిజయము (కుమారసంభవం) చేసిన మూడేళ్లకు దీనిని వ్రాయటం సంభవించింది. ఇది భగవంతుని లీల. ఎందుకంటే....

నాకు సంస్కృతం రాదు. దేవనాగర లిపి చదవడం కూడా అంతంతమాత్రమే. అర్థం చేసినకోవటా అందులోనూ ఆదిశంకరుల 'నారికేళపాకం' నా వల్ల అయ్యే పనికాదు. కాబట్టి ఈ భుజంగస్తోత్రం నాకు సాధ్యమయ్యే పనికాదు. అసాధ్యములను సాధ్యంచేయుటం, సాధ్యాలను దుస్సాధ్యం చేయడమే భగవంతుడి చమత్కారం. ఒకనాడు జయంతి రంజన్ గారు మీ షణ్ముఖవిజయం చదివానండీ, మీకు సుబ్రహ్మణ్య



భుజంగం అనే ఆదిశంకరుల రచన పంపిస్తాను దాన్ని తెలుగులో వ్రాయండి అని అడిగారు. అప్పట్లో ఆ భుజంగం దేవనాగరిలిపిలో వుందని నాకు తెలియదు. తెలిసుంటే నావల్ల కాదనే వాడినేమోకానీ తీరా నాకు భుజంగం అందాక తెలిసింది. నావల్ల కాదనుకొంటుంటే కృష్ణరెడ్డిగారనే స్నేహితులు సహాయం చేశారు. ఆయన రిటైర్డ్ హిందీ లెక్చరర్.

ఆయన దయవల్ల నాపని సానుకూలమైంది. ఆయన దేవనాగరిలోవున్న శ్లోకాలన్నింటినీ తెలుగు లిపిలోకి మార్చి ఇచ్చి గొప్పసహాయం చేశారు. శ్లోకాలకు తాత్పర్యం ఇంగ్లీషులో లభించింది. దాన్ని తెలుగులోకి తర్జుమా చేసికొని. పద్యాలలోకి మార్చి కావలసిన మార్పులు చేసుకొని మొత్తానికి 'సుబ్రహ్మణ్యభుజంగమ్' పూర్తిచేయగలిగాను. తమిళనాడు రాష్ట్రంలో తిరుచందూరు పట్టణంలో సముద్రతీరాన వెలసిన సుబ్రహ్మణ్యుని శ్రీ ఆదిశంకరులు దర్శించి గీర్వాణ భాషలో దీన్ని చెప్పారు.

33 శ్లోకాలున్న ఈ సుబ్రహ్మణ్యభుజంగం నిత్యపారాయణ కోసం నిర్దేశించబడిన స్తోత్రము. ప్రథమశ్లోకము గణేశస్తుతి అంతిమ శ్లోకము ఫలశ్రుతి. అన్నీ సిసలైన ' నారికేళపాకం' లో చెప్పిన శ్లోకములే. చిన్నచిన్న పొరబాట్లు సంస్కృతంలో చాలా



పెద్దపొరపాట్లవుతవి. ఒక చిన్న "చుక్క" తెలుగులో 'సున్నా' అవుతుంది. చుక్క పెట్టడం మరిచినా లేక చుక్కసరిగా కనిపించకపోయినా 'సున్నా' లేకపోతే విపరీతమైన అర్థమే రావచ్చు. కనుక దేవనాగరిని తెలుగు వ్రాతలో మార్చినప్పుడు పొరబాట్లు రెండురకాలుగా రావచ్చు. అయినా సాధ్యమైనంత వరకు తప్పులు దొర్లకుండా జాగ్రత్తపడ్డాను. ప్రతి శ్లోకానికి ఒక పద్యం, దానికి తగ్గ తాత్పర్యం వ్రాశాను. పద్యంలో ఇముడ్చుట సాధ్యంకాని సమాచారం తాత్పర్యంలో వివరించాను.

తేటగీతి పద్యానికి చరణాలు నాలుగు ఉండాలి. కాని ఆరు, ఎనిమిది, పది, పన్నెండు పాదాలతో కూడ తేటగీతి పద్యం చెప్పవచ్చు. అందుకనే నేను సాధారణంగా అనువాదానికి తేటగీతి పద్యాన్ని ఎన్నుకొంటాను.

ఈ నాప్రయత్నం రసజ్ఞులైన మీ అందరికీ అనందం కలిగిస్తుందని నా నమ్మకం.


ఈ భుజంగం మీ కళ్ళముందుండటానికి తోడ్పడిన సహృదయులందరికీ నీ కృతజ్ఞతలు. ఇదేగాక నా ఇతర రచనలు చదవటానికి **Please visit my website**
**www.geetadeeksha.com**

**My sincere thanks to 1. Sri M. Ganesa Iyer**
**2. Sri Mayavaram Ravishanker**



# అంకితము

**ఆ.వె॥ అమ్మకూచియొకడు, అయ్యకూచియొకండు**
**విష్ణునాయకుండుపెద్దవాడు,**
**చిన్నకొడుకు దేవసేనాధిపతియట**
**అన్నదమ్ములకిది అంకితమ్ము.**





e
om
ishanker

# శ్రీ సుబ్రహ్మణ్యభుజంగమ్

## 1. శ్రీ విఘ్ననాథుని స్తుతి :

**శ్లో॥ సదాబాల రూపాఽపి విఘ్నాద్రి హంత్రీ**
**మహాదంతి వక్త్రాఽపి పంచాస్యమాన్యా ।**
**విధీంద్రాది మృగ్యా గణేశాభిధామే**
**విధాంతాం శ్రియం కాఽపి కళ్యాణమూర్తిః ॥**

తే॥ అతడు బాలరూపుడు సదా, హితము కలుగ
విఘ్నపర్వతముల గూల్చు విమలయశుడు
గొప్పదంతాలు ముఖమున గూడువాడు
పంచముఖి శంభుసూనుడు, బ్రహ్మతోడి
సురుల సురపతి కోర్కెలు దీరుకొరుకు
ఆశ్రయింతురు 'గణపతి' అని నుతించి
శ్రియ ప్రదాత, కళ్యాణమూర్తియును యితడె
నేను భజియింతు నాతని నిలిపి మదిని.



తా॥ ఆతడు సదా బాలుని రూపములో నుండవాడు. పర్వతములవంటి విఘ్నములను నివారించువాడు. గొప్పదంతములున్న ముఖము కలవాడేగాక పంచముఖుడైన తన జనకుడు పరమేశ్వరుని వలన అంతాలేని గౌరవము బడయుచున్నవాడు. బ్రహ్మాది దేవతలతో దేవేంద్రుడు ఆ మహానుభావుని చేత తమ కోర్కెలు నెరవేర్చుకొనుటకై ఆశ్రయింతురు. అందరి చేత గణేశుడని పిలువబడుచున్నాడు. ఆయన శ్రియ (శ్రేయస్సు) ప్రదాతే కాక కళ్యాణమూర్తికూడా. మనస్సున నిలిపి నేనాస్వామిని భజించెదను.



## 2. శంకరా చార్యుల వినమ్రత :

**శ్లో॥ నజానామి శబ్దం నజానామి చార్థం**
**నజానామిపద్యం నజానామి గద్యం।**
**చిదేకాషడాస్య హృదిద్యోతతేమే**
**ముఖాన్నిః సరంతే గిరిశ్చాపి చిత్రమ్॥**

తే॥ ఏను శబ్దంబనగనేమొ యెరుగనైతి
అర్థమనగనదేమొకో అరయనైతి
పద్యగద్యంబులన జాడబడయనైతి
హృది చిదేకజ్యోతిగ వెలుగీయ 'గుహుడు'
నాదయుత సుశబ్దంబులు నా 'ముఖమున'
వెలవడును గాక! నా యత్నములును లేక.



తా॥ నేను శబ్దగతుల నెరుంగను. ఆ శబ్దముల యొక్క అర్థమసలే యెరుగను. పోనీ పద్యము (ఛందస్సు) గురించి యెరుగుదునా అంటే అదీ లేదు. ఇక గద్యము (వచన కవిత్వము) అనగా తెలియదు. ఏమీ తెలియక పోయినా ఒకటి మాత్రం నిజం. నా హృదయంలో చిత్ జ్యోతిగా ఏకమై 'గుహుడు','షణ్ముఖుడు', స్కందుడు, 'కుమారస్వామి' అని అనేకరకములుగా పిలువబడు సుబ్రహ్మణ్యుడు వెలుగొందుచున్నాడు. దాని వలన నా నోటి (ముఖము) నుండి అద్భుతమైన నాదములతో మిళితమైన సుశబ్దములు అనూహ్యముగ వెలువడును గాక!

## 3. వేదమూల పురుషుడు :

**శ్లో॥ మయూరాధిరూఢం మహావాక్యగూఢం**
**మనోహారి దేవం మహచ్చిత్త గేహం ।**
**మహాదేవ దేవం మహావేదభావం**
**మహాదేవబాలం భజేలోకపాలం. ॥**

తే॥ అతడు నెమలి మీదెక్కిన యట్టి వేల్పు
అరయగా మహావాక్యపు సారమతడు
కడు మనోహరుడైన దేవుడును యతడె
దివ్య మునుల మనంబుల తిరుగువాడు
వేదవేద్యుండు, వేల్పుల వేల్పు, పతియు
హరుని బాలుడు లోకాలపాలకుండు.



ఈ శ్లోకం పఠిస్తున్నప్పుడు ఆదిశంకరాచార్యులవారికి సుబ్రహ్మణ్యుడు తన దివ్య దర్శనమిచ్చాడట.

తా॥ మహానుభావుడైన సుబ్రహ్మణ్యుడు నెమలి వాహన మధిరోహించి సంచరించును. మహావాక్యము లెరింగించిన స్వామి ఆయనే. ఆయన చాల అందగాడైన వేలుపు. మహాఋషుల మనోవినీలాకాశంలో సంచరించే షణ్ముఖుడు, ఆయనే. వేదములచే విశదీకరింపబడిన దేవదేవుడీ కుమారస్వామి. శివుని ప్రియబాలుడు అయిన ఆ మనోహరుడు నిజముగా లోకపాలకుడు.



## 4. సాగరతీరమున స్తవమునకు కారణము :

**శ్లో॥ యదా సంనిధానం గతా మానవామే**
**భవాంభోది పారం గతాస్తేతదైవ ।**
**యితి వ్యంజయన్ సింధుతీరే య ఆస్తె**
**తమీడే పవిత్రం పరాశక్తి పుత్రం ॥**

తే॥ నీదు శరణము పొందిన నిన్నుజేరి
ఘోరసంసారజలధిని కూడ నరులు
దాటగలరను నట్టి ఆ మాట నిజము
అన్నతీరున నీ వూరు అమరియుండె
జలధి తీరాన, ఓ పరాశక్తి పుత్ర!
ఓ కుమారా! సదా నీవె మాకు రక్ష.



తా॥ ఓ సుబ్రహ్మణ్యా! పరమపవిత్రురాలైన ఆదిపరాశక్తి పార్వతిదేవి కుమారా! సముద్ర తీరమునందు నీ సన్నిధానము నెలకొనియున్నది. (తిరుచందూరు పట్టణము). నీ శరణముపొందిన మానవులు సంసారసాగరమును అవలీలగా దాటి ఆవలి తీరమునకు చేరగలరు, అను సత్యమునకు సంకేతముగా నీయొక్క ఆలయము సాగరతీరమున నెలకొని యున్నది.

## 5. సంకటనివారకుడు సుబ్రహ్మణ్యుడు :

**శ్లో॥ యథాబ్ధే స్తరంగాలయుం యంతి తుంగా**
**స్తథైవాపదః సన్నిధౌ సేవతాంమే।**
**ఇతీ ఓర్మి పంక్తీర్ నృణాం దర్శయం తం**
**సదా భావయే హృత్ సరోజౌ గుహం తం॥**

తే॥ తీరమును తాకి కెరటాలు విరిగిపడును
నిన్ను దర్శించు భక్తుల నెమ్మనముల
దుఃఖ లహరుల రూపులు తొలగిపోవు
నీదు దర్శనంబును జేయ నిలిచి యెదుట
ఓ గుహా! హృత్సరోజానయుంచి నిన్ను
శరణు పొందిన భావించి చాలునయ్య!



తా॥ చెలియలికట్టను తాకి అస్థిత్వము కోల్పోవు సాగర (తిరుచందూరు పట్టణములోనున్న సముద్రము) కెరటముల వలె, భక్తుల మనస్సులలో ఆవహించిన దుఃఖసాగరములు నీ దర్శన మాత్రమున రూపమాసిపోతాయా. ఓ గుహా! ( భక్తుల మనోగుహలలో నివసించు సుబ్రహ్మణ్యా!) నిన్ను నీ సన్నిధిలో సదా సేవించెదము. సదా మా యొక్క హృత్సరోజములలో నిన్ను భావించెదము. నిన్ను శరణుజొచ్చెదము.



## ౬. సుగంధ పర్వత స్తుతి :

**శ్లో॥ గిరౌమన్నివాసే నరా యేఽధి రూఢా**
**స్తదాపర్వతే రాజతే తేఽధి రూఢాః ।**
**ఇతీవబ్రువన్ గంధశైలాధి రూఢః**
**సదేవో ముదేమే సదాషణ్ముఖోఽస్తు ॥**

తే॥ నీవు సౌగంధగిరిపైన నిలిచియుండి
మాట నిలుపుకొందువు భక్తవరులకిచ్చి
భక్తులెవరైన సౌగంధ పర్వతంబు
నెక్కి నిను గొల్వ షణ్ముఖా! హిమనగంబు
అయిన కైలాసశికరంబు నతిశయించి
గాంచు పుణ్యంబు వారందగలరు, ధరణి.



తా॥ ఓ షణ్ముఖా! నీవు సుగంధ పర్వత శిఖరముపైన నెలకొని నీ భక్తులందరికీ చేయు వాగ్దానమేమనగా, ఏ భక్తుడైనా భక్తితో ఈ సుగంధపర్వతము నెక్కినంత మాత్రమున సాక్షాత్తు హిమాలయములలోని పరమేశ్వరుని కైలాసపర్వతము నెక్కిన పుణ్యమును తప్పక పొందును. ఆరు ముఖముల సుబ్రహ్మణ్యుడు సుగంధ పర్వతము పైనుండి భక్తుల అభీష్టములను ప్రసాదించుగాక!

## 7. గుహుని మహిమ :

శ్లో॥ మహాంభోధితీరే మహా పాపచోరే
మునీంద్రానుకూలే సుగంధాఖ్యశైలే
గుహాయాం వసంతం స్వభాసా లసంతం
జనార్తి హరంతం శ్రయామో గుహంతమ్ ॥

తే॥ నీదు భక్తుల పాపంబు నిహతిజేయు
కడలి తటిని సుగంధశిఖరము పైన
నిలిచి ముని జనులందరు గొలుచుచుండ
వారి దుఃఖంబు హరియించు వాడవయ్య!
స్వప్రకాశరూపుడవైన స్వామివయ్య!
గుహుడవై సదామాయెద గుహల నిలుము.



తా॥ ఓ ప్రభూ! భక్తుల పాపములను హరించు సుగంధపర్వతము, మహాసముద్రపుతీరమున నెలకొనియున్నది. నీవు అక్కడ మునులు నిశ్చింతతో తపస్సు చేసికొనుటకు వీలుగా స్థిరపడియున్నావు. నీ భక్తుల దుఃఖములను రూపుమాపుటకు స్వప్రకాశ రూపునిగా నీ ఆశ్రితుల మనోగుహలయందు నివసించు నిన్ను సదా ప్రార్థించెదము.



## 8. సుబ్రహ్మణ్యుని శయ్యాగృహపు వర్ణన :

శ్లో॥ లసత్ స్వర్ణ గేహేనృణాం కామదోహే
సుమస్తోమ సంఛన్న మాణిక్యమంచే
సముద్యత్సహస్రార్క తుల్యప్రకాశం
సదాభావయే కార్తికేయం సురేశం ॥

తే॥ స్వర్ణ రంజిత గృహమున, మాణికములు
తాపియున్న మంచపు నాల్లు వైపులందు
మధురమౌ గుబాళింపుల పరిమళములు
నెగడు పూలపాన్పొక్కటి తగుచునుండెఔ
వేయి సూర్యకాంతుల నీవు వెలుగుచుండ
కార్తికేయా! సురేశ్వరా! కామితముల
దీర్చి భక్తుల బ్రోవుము దివ్యచరిత!
భావమందున ధ్యానింతు బాలరూప!



తా॥ ఓ ప్రభూ! నీవు షణ్ముఖుడవు. స్వర్ణరంజిత గృహమున కెంపులు తాపిన మంచముపై నలువైపులా మధురమైన గుబాళింపులు గల పూలపాన్పును నీవు అధిష్ఠించియుంటివి. సహస్ర సూర్య తేజోవిరాజితుడవై నీవు దీప్తించుచుంటివి. నీ భక్తులు సద్భావనతో కోరు కోర్కెలనెల్ల తీర్చెడి నీవు సురేశ్వరుడవైన కార్తికేయుడవు. నిన్ను నేను సదా భావించి ధ్యానింతును.

## 9. స్వామి పాదసేవ :

**శ్లో॥ రణద్ధంసకే మంజులేఽ త్యంతశోణే**
**మనోహారి లావణ్యపీయూష పూర్ణే**
**మనఃషట్పదోమే భవక్లేశతప్తః**
**సదామోదతాం స్కందతేపాదపద్మే ॥**

తే॥ కలుగ భవదుఃఖముల చేత పలురకముల
వెతలు, మామనంబులు ప్రభూ! ప్రీతి నీదు
పాదపంకజముల చుట్టు భ్రమరము వలె
తిరిగి మితిలేని ఆనంద మరయుచుండు
నీదు మంజీరములుచేయు నిరుపమాన
ధ్వనులు భక్తుల హృదయాల తనివి దీర్చు.



తా॥ ఓ సుబ్రహ్మణ్య ప్రభూ! భవదుఃఖములచే వ్యధచెందు మా మనస్సులకు నీ పాదపద్మముల చుట్టూ పరిభ్రమించు భ్రమరముల వలె మిక్కిలి ఆనందముకలుగుచున్నది. ఆ పాదములు ఉంగరముల వంటి మంజీరముల చేత అలంకరింపబడినవై మధురమైన రవశులను వెలువరించుచున్నవి. అవి (ఆ మంజీరములు) నీభక్తుల మనస్సుల నాకర్షించుచున్నవి.



## 10. స్వామి కటిభాగమును పూజించుట :

**శ్లో॥ సువర్ణాభ దివ్యాంబరైర్భాసమానాం**
**క్వణత్కింకిణీమేఖలా శోభమానామ్ ।**
**లసద్ధేమ పట్టేన విద్యోతమానాం**
**కటిం భావయే స్కందతే దీప్యమానామ్ ॥**

తే॥ కటిని దాల్చెను బంగారు మేటి పట్టు
వలువ, దానిని మొలనూలు వడిసిబట్టె
పైడి చిరుగంటలున్ పూసలాడు చుండ
మెరసె స్వప్రకాశపు సౌరు మించియుండ
అట్టి నీరూపు యెదలోన అమరియుండ
స్కంద! ధ్యానింతు నిను సదా కరుణజూప.



తా॥ ప్రభూ! నీ నడుమున బంగారురంగు పట్టువస్త్రమును ధరించియున్నావు. అది ఒక మొలనూలుచే బిగించబడియున్నది. ఆ మొలనూలికి గణగణ మ్రోగు బంగారు చిరుగంటలు మరియు బంగారు పూసలు గుచ్చబడియున్నవి. అవి అన్నియు స్వయం ప్రకాశమానమైయున్నవి. ఓ స్కందా! అట్టి నిన్ను నేను సదా హృదయ పూర్వకముగా ధ్యానింతును.

## 11.స్వామి వక్షః స్థలమును పూజించుట :

శ్లో॥ **పులిందేశకన్యా ఘనాభోగ తుంగం**
**స్తనాలింగనాసక్త కాశ్మీరరాగమ్**
**నమస్యామహం తారకారే తవోరః**
**స్వభక్తావనే సర్వదా సానురాగమ్**

తే॥ భిల్ల కన్యకౌగిట నీవు బిగియబడగ
ఆమె ఘనమైన స్తనముల నణగిపోయి
కుంకుమాంకితమై నీకు కూడ, ఛాతి
ఎఱ్ఱబారెను, అట్టి నీవెపుడు మమ్ము
భక్త కోటిని కరుణింపు వదలకుండ
నీదు వక్షస్థలిని బూని నే కొలిచెద
తారకాసురభంజనా! దయనుజూపు
వందనములు జేతును ప్రభూ! వల్లినాధ!



తా॥ తారకాసురుని శత్రువువైన ఓ సుబ్రహ్మణ్యా! భిల్లకన్య (వల్లీదేవి) కుంకుమాంకితమైన ఘనస్తనపరిష్వంగము చేత నీ ఛాతి ఎఱ్ఱబారినది. అట్టి రూపమున నీవు నీ భక్తకోటిని అన్నివేళలా అనుగ్రహించుచున్నావు. ఓ ప్రభూ! అటువంటి నీ వక్షస్థలమును నేను నమస్కరించి కీర్తించెదను గాక!



## 12. స్వామి పన్నెండు బాహువులను పూజించుట :

శ్లో॥ **విధౌ క్లుప్తదండాన్ స్వలీలాధ్రుతాండా-**
**న్నిరస్తేభశుండాన్ ద్విషత్కాలదండాన్ ।**
**హతేంద్రారి షండాన్ జగత్రాణశౌండాన్**
**సదా తే ప్రచండాన్ శ్రయే బాహుదండాన్॥**

తే॥ నలువనే తొల్లి దండించినావు స్కంద!
నిలిచి యేలేవు జగతిని లీలవోలె
సురపతికి శత్రుమూక అసురులనెల్ల
బాహుదండాల చేతనే పరిహరించి
బ్రోచినావు ముల్లోకాల, పూజసేతు
అరిభయంకరమైన నీ హస్తములను



తా॥ ఓ సుబ్రహ్మణ్యా! నీవు పూర్వము బ్రహ్మనే దండిచితివి. నీ బాహువులు ప్రపంచమును లీలగా పరిపాలించుచున్నవి. సురేంద్రుని పగవారు అయిన (శూరపద్మని వంటి) దానవులను నిర్జించిన నీ పన్నెండు బాహుదండలు అనుపములై ( పోల్చలేనివై) జగద్రక్షణ చేయుచున్నవి. అరిభయంకరములైన నీ బాహువులను నేను వినయముతో పూజించెదను.

## 13. స్వామి షణ్ముఖములను కీర్తించుట :

**శ్లో॥ సదా శారదాః షణ్ మృగాంకా యదిస్యుః**
**సముద్యంత ఏవ స్థితాంచేత్ సమంతాత్**
**సదాపూర్ణ బింబాః కలంకైశ్చహీనా**
**స్తదా త్వన్ముఖానాం బ్రువే స్కంద సామ్యమ్॥**

తే॥ దేనితో పోల్చగలనయ్యా! దివ్యమైన
నీదు ఆరు ముఖములను నేను స్కంద!
గగన సీమలో యెపుడైన కానబడిన
పూర్ణచంద్రులార్గురు మచ్చ వునికి లేక
అన్నిదిశల కాంతులు జిమ్మ అపుడు కూడ
పోల్చ కాదు ఆ కాంతినీ ముఖములందు.



తా॥ ఓ షణ్ముఖా! స్కందా! నీ ఆరు ముఖములను నేను దేనితో పోల్చగలను? గగన సీమలో మచ్చలేని ఆరు చంద్రబింబములు పొడజూపి అవి నలుదిశలా తమ కాంతిననర్గళంగా విరజిమ్ముతుంటే వానిని కూడా అనదృశమైన నీ షణ్ముఖముల కాంతితో పోల్చనసాధ్యము ప్రభూ!



## 14. స్వామి ముఖకవళికల స్తుతి :

**శ్లో॥ స్ఫురన్ మందహాసైః సహంసాని చంచ-**
**త్కటాక్షావలీభృంగ సంఘోజ్జ్వలాని ।**
**సుధాస్యంది బింబాధరణీశ సూనో**
**తవాలోకయే షణ్ముఖాంభోరుహాణి ॥**

తే॥ పద్మముల వలె వికసించు వదనములవి
ఆరు హంసల వలె తోచె వరుసదీర
కదలు తుమ్మెదలారుగా కనులుతోచె
అమృతమొలికెను ఎఱ్ఱని అధరములును
పరమశివుని కుమారుడా! భక్తవరద!
శోభలీనెడి నీరూపు శుభప్రదంబు.



తా॥ ఓ పరమేశ్వరుని కుమారా! వికసిత పద్మముల వలెనున్న నీఆరుముఖములను నేను తిలకించుచున్నాను. హంసల వలె ఆ ముఖములు దేదీప్య మానంగా శోభిల్లుతున్నాయి. తుమ్మెదల వలె సంచలించు పన్నెండు కన్నులు మిలమిల మెరుయుచున్నవి. అమృతములొలుకు ఎఱ్ఱని అధరములు ఆ వదనములలో విరాజిల్లుతున్నవి.

## 15. స్వామి పన్నెండు కన్నుల స్తుతి :

**శ్లో॥ విశాలేషు కర్ణాంత దీర్ఘేష్వజస్రమ్**
**దయాస్యందిషు ద్వాదశ స్వీక్షణేషు**
**మయీషత్కటాక్షః సకృత్పాతితంచే-**
**ద్భవేత్తే దయాశీల కానామహానిః ॥**

తే॥ స్వామి! కర్ణాంతముల దాక సాగియున్న
పెద్ద సువిశాల నయనాల వేల్పువీవు
పదియురెండైన కన్నుల వాడవయ్యా!
ఒక్కసారైన ఒక కంట ఓరజూచి
కనికరింపు దయాశీల! కష్టమేమి?
ఓ పినాకీ సుతా! నన్ను బ్రోవుమయ్యా.



తా॥ ప్రభూ! కర్ణాంతముల వరకు (చెవి అంచులదాకా) సాగిన విశాలమైన పంద్రెండు నయనములు నీకున్నవి కదా! ఒక్కసారి ఒక్కకంటితోనైనా ఒకింత ఓరగానైన నన్ను చూచి అనుగ్రహించరాదా! ఓ దయాసాగరా! ఓ పరమేశ్వరనందనా! అట్లు చేయుటవలన నీకు వచ్చిన కష్టమేమున్నది?



## 16. స్వామి ఆరుతలలను స్తుతించుటః :

**శ్లో॥ సుతాంగోద్భవో మేఽసి జీవేతి షడ్ధా**
**జపన్మంత్ర మీశో ముదాజిఘ్నతేయాన్**
**జగద్భార భృద్ భయో జగన్నాథతేభ్యః**
**కిరీటోజ్ జ్వలేభ్యోనమోమస్త కేభ్యః**

తే॥ ధగ ధగితమైన కెంపులు తాపబడుట
మెరిసె నీ కిరీటంబులు ఆరు, స్వామి!
సర్వజీవుల గాచును జగములందు
ఆరుముఖములు జగపతీ! అమితమైన
ప్రేమని మూర్కొని హరుడు దీవించు నిన్ను
సుత! చిరంజీవివవుదువు శుభములంది.



తా॥ ఓ జగన్నాథా! ధగ ధగ మెరుయుచున్న కెంపులతో తాపబడిన ఆరు స్వర్ణకిరీటములను ధరించియున్న నీ ఆరు శిరస్సులకు నేను మోకరిల్లుచున్నాను. నీ శిరస్సులు జగములలోని సర్వజీవులను రక్షించుచున్నవి. అవి అత్యంతవాత్సల్యముతో పరమేశ్వరునిచేమూర్కొనబడి “నా తనూజా! దీర్ఘాయుష్మాన్ భవ!” అని ఆశీర్వదింపబడినవి.

## 17. బాలసుబ్రహ్మణ్యుని స్తుతి :

**శ్లో॥ సురద్రత్న కేయూరహారాభిరామ-**

**శ్చలత్కుండల శ్రీలసద్ గండ భాగః**

**కటౌ పీతవాసః కరే చారు శక్తిః**

**పురస్తాన్ మమాస్తాం పురారేస్తనూజః ॥**

తే॥ వక్షమున, భుజములపైన పరిఢవిల్లె

వెలుగు కేయూర హారాలు మిలమిలమని

నీ కపోలపు నునుపులు నిగ్గుదేలె

ఊగె రత్నకుండలములు సొగసు చెవుల

కటిని పట్టు వస్త్రంబది కట్టబడియె

చేత దండాయుధంబది జిమ్మెకాంతి

నాకు దర్శనమొసగుమా ఓ కుమార!

త్రిపురహరపుత్ర! ఓ ప్రభూ! దేవదేవ!



తా॥ ఓ కుమారా! (కుమారస్వామీ!) త్రిపురాంతకుడైన పరమేశ్వరనందనా! నీ భుజములపైన, వక్షస్థలముపైన ప్రకాశమాన కేయూర (కెంపులు) హారములు ఉన్నవి. నీ కపోలములు (చెక్కిళ్ళు) శోభాయమానముగా నున్నవి. మిలమిలలాడు నీ రత్నకుండలములు మనోహరముగా ఊగుచున్నవి. నీ కటిప్రదేశమున (నడుమున) పట్టు వస్త్రము బిగింపబడియున్నది. నన్ను కరుణించి నాకీ విధముగా దర్శనము ప్రసాదింపుము ప్రభూ!

(ఈ శ్లోకం చదివిన వేంటనే ఆదిశంకరాచార్యుల ముందు కుమారస్వామి ఆయన వర్ణించినట్లే ఆయన కనులముందు ప్రత్యక్షమైనాడట)



## 18. సోమస్కందస్తుతి :

**శ్లో॥ ఇహాయాహివత్సేతి హస్తాన్ ప్రసార్యా-**

**హ్వాయత్ యాదరాచ్ఛంకరే మాతురంకాత్ ।**

**సముత్పత్యతాతం శ్రయంతం కుమారం**

**హరాశ్లిష్ట గాత్రం భజే బాలమూర్తిమ్ ॥**

తే॥ చేతులను జాచి పిలిచిన శివుడు నిన్ను,

గౌరి అంకపీఠము నుండి జారి నీవు

తండ్రీ కరముల కురికేవు త్వరితగతిని

చేరి కౌగలింతువు హరున్ చెలువు మీర

అట్టి నిన్ను ధ్యానింతును అలువు లేక

వందనంబులివే ఓ కుమార! నీకు.



తా॥ ప్రభూ! పరమశివుడు చేతులు చాచి నిన్ను ప్రేమగా ఆహ్వానించగా, నీవు పార్వతీదేవి అంకము (తొడ) పై నుండి ఉరికి ఆయన కరద్వయములను చేరి ఆప్యాయంగా కౌగిలించెదవు. అట్టి కుమారా! నేను నిన్ను భక్తితో ధ్యానించెదను. అలుపు సొలుపు లేక సదా నీకు నమస్కరించెదను.

# 19. వ్యామోహము రూపుమాపు పదకొండు నామములు :

**శ్లో॥ కుమారేశసూనో గుహస్కంద సేనా-**
**పతే శక్తిపాణే మయూరాధి రూఢ ।**
**పులిందాత్మజాకాంత భక్తార్తి హారిన్**
**ప్రభో తారకారే సదారక్షమాంత్వమ్**

తే॥ షణ్ముఖా! గుహా! శివపుత్ర! స్కందస్వామి!
దేవసేనాపతీ! వల్లిదేవి నాథ!
నెమలివాహనా! తారకాదమన! శూల-
పాణి! దురిత నివారక! భక్తవరద!
వందనము సేతునో ప్రభూ! పాహి! పాహి!
నన్ను దయజూడుమో దేవ! సన్నుతింతు.



తా॥ ఓ కుమార షణ్ముఖా! విశ్వనాధుడైన శంకరనందన! భక్తజనహృదయపు గుహలలో నివసించు గుహా! ఓ స్కందస్వామీ! ఓ దేవసేనాధి పతీ! పులిందకన్యయైన వల్లీనాధా! ఓ మయూరవాహనా! తారకాసురభంజనా! పరాశక్తి స్వరూపమైన 'శక్తి' అను శూలమును ధరించినవాడా! ఓ దురిత దూరా! భక్త వరదా! నీకు నమస్కరించెదను ప్రభూ! నిన్ను సన్నుతి చేసెదను నన్ను దయ జూడుము పాహి! పాహి!



# 20. అంతిమ క్షణములో స్వామి దర్శనమునకు స్తుతి :

**శ్లో॥ ప్రశాంతేంద్రియే నష్ట సంజే విచేష్టే**
**కఫోద్గారివక్త్రే భయోత్కంపిగాత్రే**
**ప్రయాణోన్ముఖే మయ్యనాథే తదానీం**
**ద్రుతంమే దయాలో భవాగ్రే గుహ త్వమ్ ॥**

సీ॥ ఆఖరి ఘడియలు ఆసన్నమై నాకు
స్పృహతప్పిపోయెడి సమయమందు
జ్ఞానేంద్రియంబులు చచ్చుబడ్డప్పుడు
అవయవాల్కదలని అవసరమున
కఫమడ్డి గొంతులో కష్టమై ఊపిరి
గిలగిలా తన్నుక నలిగినపుడు
మృత్యుభయంబున వెలవెల బోవుచు
దిక్కెవ్వరూ లేక దిగులు జెంద



తే॥ ఓ దయాళో! గుహా! నన్ను ఆదుకొనుము
చివరి క్షణమున నీవు నా చేంత జేరి
నీదు దర్శనమీవయ్య నిముషమైన
శరణమిమ్ము సుబ్రహ్మణ్య శరణు శరణు

తా॥ దయాళువవైన ఓ గుహా! నన్ను రక్షింపుము. నా జీవితపు ఆఖరిఘడియలాసన్నమై నాకు స్పృహతప్పి పోవుచున్నప్పుడు, నా జ్ఞానేంద్రియమ్ములు పనిచేయుట మానివేసినపుడు, నా అవయవములు కదలుట మానివేసినపుడు, నా గొంతకు కఫము అడ్డుపడి ఊపిరి ఆడక నేను గిలగిలా తన్నుకొంటున్నప్పుడు, మృత్యుభయము చేత నా శరీరం గడగడా వణుకుచున్నప్పుడు, దిక్కెవ్వరూ లేక నేను దిగులు జెందియున్నప్పుడు, ఆ తుదిక్షణాలలో నా వద్దకు జేరి ఒక్క నిముషమైన నీ దివ్య దర్శనమొసగి నన్ను అనుగ్రహింపుము. ఓ ప్రభూ! సుబ్రహ్మణ్యా! శరణు శరణు.

## 21. మరణయాతనలో స్వామి స్తుతి :

**శ్లో॥ కృతాంతస్య దూతేషు చండేషు కోపా-**
**ద్దహచ్ఛింద్ధి భింద్ధీతి మాంతర్జయత్సు ।**
**మయూరం సమారుహ్య మా భైరితి త్వం**
**పురః శక్తిపాణిర్మమాయాహి శీఘ్రం ॥**

తే॥ భీకరంబైన యమబంట్లు పీడనీయ
"వీని కాల్చుడు, చంపుడు వీనిబట్టి"
అంచు ననుమూగి కేకలు మించివెట్ట
నీ మయూరవాహనడవై నిలువుమయ్య!
శక్తి శూలయుధముబట్టి శరణమీయ
తక్షణంబె నా ముందు ప్రత్యక్షమగుము
ఓ కుమార! సుబ్రహ్మణ్య! నాకు నీవు
అభయమిత్తువుగాక! ఓ హరతనూజ!



తా॥ ఓ కుమారా! భయంకరమైన యమదూతలు మహోగ్రస్వరూపులై నన్ను పీడించుచూ "వీనిని దహింపుడు, వీనిని సంహరింపుడు" అని కేకలు వేయుచూ నన్ను మూగినప్పుడు నీవు తక్షణమే నా ముందు మయూరవాహనుడవై, శక్తి శూలపాణివై ప్రత్యక్షమై నాకు నీవు అభయమిచ్చెదవు గాక! ఓ హరసుతా! సుబ్రహ్మణ్యా! శరణు.



## 22. అంతిమక్షణములో రక్షించుటకు స్తుతి :

**శ్లో॥ ప్రణమ్యాస కృత్పాదయోస్తే పతిత్వా**
**ప్రసాద్యప్రభో ప్రార్థయేఽనేకవారమ్**
**నవక్తుం క్షమోఽహం తదానీం కృపాబ్ధే**
**న కార్యాంతకాలే మనాగప్యుపేక్షా ॥**

తే॥ పొంద నీ కృపనిప్పుడే పూనుకొనెద
నీదు పదపద్మముల మదిన్ నిలుపుకొనెద
చివరి క్షణమున కలుగునా చేవ నాకు?
మనసు నిగ్రహముండునా మననమునకు?
శరణు జొచ్చెదనిప్పుడే కరుణజూప
ఓ దయానిధీ! ననువీడ రాదు తండ్రి!



తా॥ ఓ దయానిధీ! నీ అనుగ్రహమును పొందుటకై నేను నీ పాదపంకజములను సేవించెదను. నా ఆఖరి క్షణములలో నిన్ను ప్రార్థించే శక్తి మరియు మనోనిగ్రహం ఉంటాయో లేదో తెలియదు కదా! కనుక ఇప్పుడే నిన్ను శరణు జొచ్చెదను. కనికరించి నాపై ఉదాసీనుడవు కాబోకుము ప్రభూ!

## 23. మనోక్లేశ నివారణకు స్తుతి :

**శ్లో॥ సహస్రాండ భోక్తాత్వయా శూరనామా**
**హతస్తారకః సింహవక్త్రశ్చ దైత్యః**
**మమాంతర్ హృదిస్థం మనఃక్లేశమేకం**
**న హంసి ప్రభో కిం కరోమి క్వ యామి ॥**

తే॥ సింహవక్త్రుని, శూరుని సంహరించి
తారకాసురున్ దునిమావు తరుగులేక
నన్ను పీడించు వైరులు నాకు గలరు
నా మనోక్లేశమనువాడు నలిపివైచె
ఎందుబోయెద? నో ప్రభూ! ఏమిజేతు?
ఆర్తి దీర్చువారెవ్వరు? కార్తికేయ!



తా॥ ఓ ప్రభూ! నీవు శూర అనుదానవుని నిర్జించితివి. అట్లే తారకాసురుని, సింహవక్త్రుడు అను రాక్షసుని పరిమార్చితివి. కాని, నా మనస్సును పీడించి మనశ్శాంతి లేకుండ చేయుచున్న నాయొక్క మనోక్లేశమను దానవుని సంహరించవైతివి. అది నన్ను ఛిద్రముజేయుచున్నది. సహాయమునకై నేనేమి చేయుదును? ఎక్కడికిపోయెదను? (నీ కంటే నాకు వేరు దిక్కెవ్వరున్నారు? ఓ కార్తికేయా! నా బాధనెవరు తొలగింతురు?)



## 24. మనక్లేశమును రూపుమాపుటకు స్తుతి :

**శ్లో॥ అహం సర్వదా దుఃఖభారావసన్నో**
**భవాన్దీన బంధుస్త్వదన్యం న యాచే**
**భవద్భక్తిరోధం సదా క్లుప్తబాధం**
**మమాధిం ద్రుతం నాశయోమాసుత త్వమ్ ॥**

తే॥ కరువుయైన మనశ్శాంతి తరలిపోయె
నే సదా క్రుంగిపోతిని నిలువ లేక
నన్ను రక్షింపుమో ప్రభూ! నిన్ను దక్క
అన్యునొల్లను ఉమసుతా! అణగద్రొక్కు
నా మనోక్లేశముల నింక నలుగనిమ్ము
నిన్ను ధ్యానింతునో దేవ! సన్నుతింతు.



తా॥ ఓ ఉమాసుతా! నేను సదా మనశ్శాంతి లేక బాధపడుచుంటిని. నీవు దీనబంధుడవు. నన్ను రక్షింపుము ప్రభూ! నేను నిన్ను తప్ప అన్యులెవరినీ శరణు వేడను. నీవు శీఘ్రముగా నా మనోక్లేమును రూపుమాపుము. దానివలన నేను నిన్ను ధ్యానింపలేకున్నాను.

## 25. స్వామి విభూతి యొక్క మహిమ :

శ్లో॥ అపస్మార కుష్ఠ క్షయార్శః ప్రమేహ-

జ్వరోన్మాద గుల్మాది రోగా మహంతః

పిశాచాశ్చ సర్వే భవత్పత్రభూతిం

విలోక్య క్షణా త్తారకారే ద్రవంతే॥

ఆ.వె॥ మూర్ఛ, కుష్ఠు, సెగయు, భూతపిశాచాది

వ్యాధులున్ను, క్షయయు, జ్వరము గాని

పట్టిపీడనీయ వదిలించు నీ స్తుతి

తనివి దీర చేయ తారకారి!



తా॥ ఓ తారకాసురభంజనా! లోకములో మానవులను పలు రకములైన రుగ్మతలు పీడించుచుండును. తీవ్రమైన మూర్ఛ, కుష్ఠు, ఉబ్బసము, సుఖవ్యాధులు, జ్వరము, పిశాచాది మానసిక వ్యాధులు, నీమహిమను గురించి ఎరిగిన తక్షణమే పటాపంచలై పోవును.



## 26. ఇంద్రియముల కర్తవ్యము :

శ్లో॥ దృశి స్కందమూర్తిః శ్రుతౌ స్కందకీర్తి-

ర్ముఖే మే పవిత్రం సదా తచ్చరిత్రమ్।

కరే తస్య కృత్యం వపుస్తస్య భృత్యం

గుహే సంతులీనా మమాశేషభావాః ॥

సీ॥ నే సదా స్కందుని నిర్మలరూపంబు

కనులముంగిట నిల్పి కనెద గాక!

నే సదా స్కందుని నిరుపమ లీలలన్

వీనుల ప్రీతితో వినెదగాక!

నే సదా స్కందుని నిలిచి కీర్తించనై

పలుమార్లు నా నోరు పలుకుగాక!

నే సదా స్కందుని నిగ్రహంబున గొల్వ

కరములు సేవించ గలుగుగాక!



తే॥ తనువు స్కందుని కర్పించి మనెద గాక!

నేను త్రికరణశుద్ధిగా నిలిపిమదిని

నిరుపమాన సన్మూర్తిని తారకారి

గుహుని పేర్మి సుబ్రహ్మణ్యు గొలుతుగాక!

తా॥ ఓ సుబ్రహ్మణ్యా! నేను సదా నిరుపమానమైన నీ మూర్తిని నాకనుల ముందు నిలుపుకొనెదను గాక! నాచెవులు సదా స్కందుని సన్నుతినే ఆలకించునుగాక! నా నోరు సదా స్కందునే కీర్తించును గాక! నా కరములు సదా నిగ్రహముతో స్కందుని సేవించును గాక! నా తనువును సదా స్కందుని కర్పింతునుగాక! నేను త్రికరణశుద్ధిరగా నిలచి నిత్యమూ గుహుని కొలిచెదను గాక!

## 27. సామాన్యుని సంరక్షకుడు షణ్ముఖుడే:

**శ్లో॥ మునీనాము తాహో నృణాంభక్తి భాజా-**
**మభీష్టప్రదాః సంతి సర్వత్ర దేవాః**
**నృణామంత్యజానామపి స్వార్థదానే**
**గుహాద్దేవ మన్యం న జానే న జానే ॥**

కం॥ మునులకు, భక్తుల కిలలో
వెనుకాడక వరములిచ్చు వేల్పులు లేరా?
తను అంత్యజుండు గానీ
నిను శరణన బ్రోతువయ్య నిజముగ స్కందా!



తా॥ ఓ స్కందా! మహానుభావుడవైన గుహా! జగాలన్నింటిలోను మునులకు నిష్ఠాగరిష్ఠులైన భక్తులకు వరములొసంగు దేవతలు కోకొల్లలు. కానీ సామాన్యులను, అంత్యజులను బ్రోచుటకు నీవు దక్క అన్యులెవ్వరూ లేరు ప్రభూ!



## 28. షణ్ముఖుడే మా కులదైవం

**శ్లో॥ కలత్రం సుతా బంధువర్గః పశుర్వా**
**నరోవాథ నారి గృహేమే మదియాః**
**యజంతో నమంతః స్తువంతో భవంతమ్**
**స్మరంతశ్చ తే సంతు సర్వే కుమార॥**

తే॥ నాదు భార్యయు, పుత్రులు, నాదు హితులు,
నాదు బందుగుల్,ఇతరులు నయము మీర
నీకు ప్రణమిల్లెదరు ప్రభూ! నిన్ను స్తుతిని
జేసి, స్మరియించెదరు నిన్ను శివకుమార!



తా॥ ఓ కుమారా! నా భార్య, సుతులు, బంధువులు, స్నేహితులు, మా ఇంటి పరిసరాల్లోని ఇతరు స్త్రీ పురుషులు నీకు ప్రణమిల్లెదరు, నిన్ను స్తుతించెదరు. వారు నిన్ను సదా స్మరించెదరు. శివకుమారుడవైన నిన్నే ధ్యానించెదరు.

## 29. వ్యాధినివారణకు వేలాయుధస్తుతి :

**శ్లో॥ మృగాః పక్షిణో దంశకా యే చ దుష్టా-**
**స్తథా వ్యాధయో బాధకా యే మదంగే**
**భవచ్ఛక్తి తీక్ష్ణాగ్ర భిన్నాః సుదారే**
**వినశ్యంతు తే చూర్ణిత క్రౌంచశైల॥**

తే॥ క్రౌంచశైలంబు ఖండించి కార్తికేయ
చూర్ణమును జేసినావుగా చోద్యముగను
నాదు మేనుగాని, పశుపక్ష్యాది గాని
కాని జంతువుల్, క్రిమికీటకములు గాని
రోగపీడితులౌగాని లోకపాల!
గావు మెల్లర నీ శూల గరిమవలన.



తా॥ క్రౌంచశైలమును చూర్ణము చేసిన ఓ కార్తికేయా! నా శరీరమును గానీ, పశుపక్ష్యాదులను గానీ, క్రిమికీటకములనుగానీ, రోగభయగ్రస్థులనుగానీ బాధించువేనినైననూ తీక్షణమైన నీ యొక్క శూలాయుధముచే పొడిచి సుదూరముగా పోద్రోలి సంహరింపుము.



## 30. జగత్పితసంస్తుతి :

**శ్లో॥ జనిత్రీ పితా చ స్వపుత్రాపరాధం**
**సహేతే న కిం దేవసేనాధినాథా**
**అహం చాతిబాలో భవాన్ లోకతాతః**
**క్షమస్వాపరాధం సమస్తం మహేశ॥**

చం॥

జనకుడు బిడ్డపై పగను చాటానె? సైపడె వాని నేరముల్
తనయుడ నేను లొంగితిని దారుణమౌ మదమచ్చరాలకున్
పనిగొని యెంచ బోకుమిక పాపములన్ సురసేనవల్లభా!
వినుము జగత్పతీ! వినతి, వేడెద నిన్ శరణంబు నోగుహా!



తా॥ ఓ గుహా! దేవసైన్యాధ్యక్షా! శరణు శరణు. తండ్రి తనయుని తప్పుల్ని మన్నించకపోతే ఇంకెవరు మన్నిస్తారు? నీవు చూస్తే జగత్పతివి. నేనేమో కామ, క్రోధ, లోభ, మోహ, మద, మచ్చరములను ఆరు శత్రువులకు లొంగిపోయిన అర్భకుడను. పదేపదే నా పాపముల నెంచక నన్ను మన్నించి కాపాడుము.

## 31. సుబ్రహ్మణ్యుని స్తుతి :

**శ్లో॥ నమః కేకినే శక్తయే చాపి తుభ్యం**
**నమశ్ఛాగ తుభ్యం నమః కుక్కుటాయ।**
**నమః సింధవే సింధుదేశాయ తుభ్యం**
**పునః స్కందమూర్తే నమస్తే నమోఽస్తు॥**

సీ॥ ఓ మయూరమ! నీకు ఒనరంగనీ వేళ
భక్తితో జేతు నే వందనములు
శక్తిశూలమ! నీకు శరణు వందనములు
మేషమా! ప్రణతులు మించినీకు
కుక్కుటమా! నీకు పెక్కు వందనములు
సాగరమా! నమస్కారములివె
శ్రీతిరుచందూరు క్షేత్రమా! నీకిదే
భక్తితో జేతునే వందనములు



ఆ.వె॥స్కందస్వామి! నీకు శరణు వందనములు
మరలమరల జేతు వందనములు
పూర్వజన్మకర్మపుణ్యవశంబున
పద్యగతిని దెలుపు భాగ్యమబ్బె.

తా॥ ఓ మయూరవాహనమా! నీకు వందనములు. (మయూరము వేదములకు సంకేతము) ఓ శక్తి ఆయుధమా! నీకు వందనములు (శక్తి శూలము పరాశక్తి అవతారమే) ఓ మేషమా! (గొఱ్ఱె) నీకు వందనములు (మేషము మాయా తత్త్వమునకు ప్రతీక) ఓ కుక్కుటమా! (కోడిపుంజు) నీకు వందనములు (కుక్కుటము అహంభావమునకు ప్రతీక) ఓ సాగరమా! నీకు వందనములు ( సాగరము ఆనందమునకు సంకేతము) ఓ తిరుచందూరుక్షేత్రమా! నీకు వందనములు. ఓ స్కందస్వామీ! నీకు వందనములు. మీ అందరికీ మరల మరల వినమ్ర పూర్వక వందనములు. ఇదంతా నాగత జన్మల పుణ్యఫలమే.



## 32. స్వామి జయఘోష :

**శ్లో॥ జయానందభూమంజయాపారధామ-**
**జ్ఞయామోఘకీర్తే జయానందమూర్తే।**
**జయానందసింధో జయాశేషబంధో**
**జయత్వం సదా ముక్తిదానేశసూనో ॥**

తే॥ జయము ఆనందభూమా! విజయము నీకు
జయము నీకు పరంజ్యోతి జయము జయము
జయమమోఘకీర్తీ! నీకు జయము జయము
జయము ఆనందమూర్తీ! విజయము నీకు
జయము ఆనందసింధూ! విజయము నీకు
జయ మశేషబంధూ! నీకు జయము జయము
జయము నీకు సదా, ముక్తినీయుమయ్య!
జయము పరమేశునందనా! జయము నీకు.



తా॥ ఓ ఆనందకారకా! నీకు జయమగుగాక! ఓ పరంజ్యోతిస్వరూపా! నీకు విజయమగు గాక! అమోఘమైన కీర్తి గల సుబ్రహ్మణ్యా! నీకు జయమగుగాక! ఓ ఆనందమూర్తీ! నీకు సర్వదాజయమగుగాక! ఆనందసాగరా! నీకు సదా జయము కలుగు గాక! అశేషబంధువర్గం (భక్తులు) కల దేవా! నీకు జయమగుగాక! సదా ముక్తిని ప్రసాదించు కుమారా! నీకు జయమగు గాక! ఓ పరమేశ్వరుని కుమారా! నీకు సదా విజయము, జయ పరంపర కలుగు గాక!

## 33. ఫలశ్రుతి :

**శ్లో॥ భుజంగాఖ్యవృత్తేన క్లుప్తం స్తవంయః**

**పఠేద్భక్తియుక్తో గుహం సంప్రణమ్య ।**

**సుపుత్రాం కలత్రం ధనం దీర్ఘమాయు-**

**ర్లభేత్ స్కంద సాయుజ్యమంతే నరః సః॥**

సీ॥ ఈ భుజంగ స్తోత్రమెవ్వారు భక్తితో

పఠియింతురో పూని ప్రతిదినంబు

స్కందుని పరిపూర్ణ కరుణ లభించును

స్థిరభక్తి గొలిచెడి సిద్ధి కలుగు

సౌశీల్యవతియైన సతియు లభించును

సత్పుత్రప్రాప్తియు జరుగగలదు

సిరిసంపదల వృష్టి జరిగితీరును ఇలన్

దీర్ఘాయువును గని, దివికిజేరి



తే॥ స్కందు సన్నిధి గడుపును సమయమంత

పరమమైన ఆత్మానంద ప్రాప్తి గనును

ఆదిశంకరాచార్యుల అమర కృతిని

చదువ బ్రతుకున ధన్యత జరుగుగాక!

తా॥ ఆదిశంకరాచార్య ప్రణీతమైన ఈ భుజంగస్తోత్రమును ఏ భక్తుడైతే గుహుడని ప్రసిద్ధిచెందిన సుబ్రహ్మణ్యుని సన్నిధిలో భక్తితో ప్రతిదినమూ పఠించునో వానికి సుబ్రహ్మణ్యుని పరిపూర్ణకరుణ సిద్ధించును. సౌశీల్యవతియైన సుందరి భార్యగా లభించును. సద్బుద్ధిగల పుత్రులు కలుగుదురు. సిరిసంపదలు కలుగును. దీర్ఘాయుష్మంతులై మరణానంతరము స్కందుని సన్నిధిలో ఆత్మానందముతో గడుపు భాగ్యము ప్రాప్తించును.



